# జమ్మికుంట మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలపై దుమారం

## మూలకు పడ్డ చెత్తబండ్లకు కొత్త టైర్లు..
## అధికారుల తీరుపై కౌన్సిలర్ ఒగ్గు రమేష్ యాదవ్ ప్రశ్నలు
## అవినీతిని ప్రశ్నించినందుకే నాపై తప్పుడు ఆరోపణలు: శ్రీపతి నరేష్ గౌడ్



**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):** జమ్మికుంట మున్సిపాలిటీలో నిధుల వినియోగం, పారిశుధ్య విభాగం పనితీరు, చెత్తబండ్ల నిర్వహణ తదితర అంశాలపై ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. ప్రజాధనం వినియోగంలో పారదర్శకత పాటించాలంటూ పలువురు ప్రశ్నలు లేవనెత్తుతుండగా, మరోవైపు రాజకీయ ఆరోపణలు కూడా తీవ్రతరం అవుతున్నాయి.

**మూలకు పడ్డ చెత్తబండ్లకు కొత్త టైర్లు?**

మున్సిపాలిటీలో వినియోగంలో లేకుండా మూలకు పడ్డ చెత్తబండ్లకు కొత్త టైర్లు ఏర్పాటు చేసిన వ్యవహారంపై కౌన్సిలర్ ఒగ్గు రమేష్ యాదవ్ అధికారుల తీరును ప్రశ్నించారు. ప్రజాధనం వినియోగంలో పారదర్శకత పాటించాలని, మున్సిపాలిటీకి చెందిన పారిశుధ్య పరికరాల నిర్వహణ, మరమ్మతులకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**అవినీతిని ప్రశ్నించినందుకే లక్ష్యంగా చేసుకుంటున్నారా?**

మరోవైపు శ్రీపతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తనపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. "మున్సిపాలిటీలో జరుగుతున్న వ్యవహారాలపై ప్రశ్నిస్తే తప్పేంటి? ప్రజల సొమ్ముకు సంబంధించిన అంశాలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై, ప్రజాప్రతినిధులపై ఉంది. అవినీతిని ప్రశ్నించడం తప్పు కాదు. నాపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఉంటే బయటపెట్టాలి" అని నరేష్ గౌడ్ అన్నారు.

ఈ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వైపు నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

**రూ.36 లక్షల వ్యవహారంపై ప్రశ్నలు**

గతంలో జమ్మికుంట మున్సిపాలిటీలో రూ.36 లక్షల ప్రజా ధనం దుర్వినియోగమైనట్లు విజిలెన్స్ విచారణలో తేలిందన్న నివేదికలను ప్రస్తావిస్తూ పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ వ్యవహారంలో నిధుల రికవరీ ఎంతవరకు జరిగింది? రికవరీ చేసిన మొత్తాన్ని ఎక్కడ జమ చేశారు? బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

**మహిళా కౌన్సిలర్ల ఆరోపణలు**

పారిశుధ్య విభాగానికి సంబంధించిన అంశాలపై కమిషనర్‌ను కలిసి ప్రశ్నించిన సమయంలో తమ పట్ల దురుసుగా ప్రవర్తించారని, ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని బెదిరించారని కొందరు మహిళా కౌన్సిలర్లు ఆరోపించినట్లు నరేష్ గౌడ్ తెలిపారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, సిబ్బంది నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది. ఆరోపణల్లో వాస్తవాలను సమగ్ర విచారణ ద్వారానే నిర్ధారించాల్సి ఉంది.

**సమగ్ర విచారణకు డిమాండ్**

మున్సిపాలిటీలో నిధుల వినియోగం, పారిశుధ్య పనులు, చెత్త బండ్ల నిర్వహణ, గతంలో వెలుగులోకి వచ్చిన ఆర్థిక అవకతవకలు, ప్రస్తుతం వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు





సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజా ధనానికి సంబంధించిన ప్రతి రూపాయికి లెక్క ఉండేలా రికా ర్డులు, ఖర్చుల వివరాలు, రికవరీ సమాచారం, అధికారిక విచా రణ నివేదికలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు – ప్రత్యారోపణలకు తెరదించేందుకు అధికారులు వాస్తవాలను పారదర్శకంగా వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

# టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు




**కొత్తగూడెం, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) 7వ రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో కొత్తగూడెంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి బి.రాజు తెలిపారు. మహాసభలను విజయవంతం చేసేందుకు ఆహ్వాన సంఘం ఏర్పాటు కోసం సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయం టీచర్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపు ఉదయం 10 గంటలకు విద్యానగర్‌లోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, చుంచుపల్లి సర్పంచ్ శాంతిశ్రీ, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, పూర్వ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్య అతిథులుగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని, ఎం.రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి తదితరులు గౌరవ అతిథులుగా హాజరవుతారని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, విద్యారంగ శ్రేయోభిలాషులు సమావేశానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఎం.రాజయ్య, కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మేదరి బస్తీలో ప్రపంచ వెదురు దినోత్సవం



**కొత్తగూడెం, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి)** ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని మేదరి బస్తీలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెదురుతో తయారు చేసిన వివిధ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సంఘ నాయకుడు మొలుమూరి తిరుపతి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ మేదరి కుటుంబాలు తరతరాలుగా వెదురు ఆధారిత వృత్తిపై జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. మార్కెట్లో ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం పెరగడంతో వెదురు వస్తువులకు ఆదరణ తగ్గి మేదరి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మేదరి వృత్తిపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మేదరి కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని, సొసైటీ ద్వారా నామమాత్రపు రుసుముతో వెదురు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అనంతరం మేదరి కుటుంబాలు సామూహికంగా "ప్లాస్టిక్ వద్దు.. వెదురు ముద్దు" అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పందిళ్ల రాధాకృష్ణ, బొల్లం రాజేందర్, పుట్ట దామోదర్, సత్రం వెంకటేశ్వర్లు, పట్నూరు సంజీవరావు, మొలుగూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి గుర్తింపు ఎన్నికల బరిలో టీఎన్‌టీయూసీ!?

## - క్యాడర్ సమీకరణకు ఏరియాల్లో కొత్తగూడెంలో సత్యనారాయణ విస్తృత పర్యటన

**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):** సింగరేణి కాలరీస్‌లో గుర్తింపు సంఘం ఎన్నికలపై అనిశ్చితి కొనసాగుతున్న వేళ వివిధ కార్మిక సంఘాలు తమ కార్యకలాపాలను ముమ్మరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అనుబంధ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టీఎన్‌టీయూసీ) కూడా ఎన్నికల బరిలోకి దిగేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆ సంఘం వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే టీఎన్‌టీయూసీ నాయకులు సింగరేణి ఏరియాల్లో పర్యటిస్తూ కార్మికులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

సెప్టెంబర్ 8తో గుర్తింపు, ప్రతినిధి సంఘాల రెండేళ్ల కాల పరిమితి ముగిసిందని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. కొత్త ఎన్నికలు నిర్వహించాలా, అప్పటి వరకు అన్ని సంఘాలకు సమాన హోదా కల్పించాలా అనే అంశంపై కార్మిక సంఘాలు డిమాండ్లు చేస్తున్నాయి.

**కొత్తగూడెం ఏరియాలో పర్యటన**

ఈ క్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, బీవీ రమణారావు కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్ ఏరియాలో పర్యటిస్తూ కార్మికులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. సింగరేణి వ్యాప్తంగా క్యాడర్‌ను సమీకరించి ఎన్నికలకు సిద్ధం కావడమే లక్ష్యంగా పర్యటనలు కొనసాగిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు చెబుతున్నారు. గతంలో సింగరేణి అభివృద్ధిలో టీడీపీ ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాత్ర పోషించారని టీఎన్‌టీయూసీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితులు, బొగ్గు వనరుల అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను కార్మికుల వద్ద ప్రస్తావిస్తూ తమ సంఘం విధానాలను వివరిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఎన్నికలపై టీడీపీ దృష్టి?**

సింగరేణి పరిధి తెలంగాణలోని పలు జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించి ఉండటంతో టీఎన్‌టీయూసీని బలోపేతం చేయడంపై టీడీపీ నాయకత్వం దృష్టి సారించినట్లు ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు కేశవరావుతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ అంశంపై చర్చించినట్లు ఆ సంఘం వర్గాలు చెబుతున్నాయి. అయితే సింగరేణి ఎన్నికలపై తుది షెడ్యూల్, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అధికారిక ప్రక్రియపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం వివిధ కార్మిక సంఘాలు ఎన్నికల కోసం సన్నద్ధమవుతున్నాయి.

**కార్మిక వర్గంలో ఆసక్తి**

2023 డిసెంబర్ 27న జరిగిన గత గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘంగా, ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ప్రతినిధి సంఘంగా ఎన్నికయ్యాయి. ప్రస్తుతం కాలపరిమితి ముగియడంతో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీతో పాటు టీజీబీకేఎస్, బీఎంఎస్,



హెచ్‌ఎంఎస్, ఇతర సంఘాలు ఎన్నికల అంశంపై తమ కార్యకలాపాలను వేగవంతం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీఎన్‌టీయూసీ కూడా బరిలోకి వస్తే సింగరేణి కార్మిక సంఘాల పోటీ మరింత ఆసక్తికరంగా మారే అవకాశం ఉంది.

# వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు



**పాల్వంచ, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):** విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని లక్ష్మీదేవిపల్లిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం విశ్వకర్మ మహాయజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు పెద్దోజు నాగాచార్యులు, అరిగే శశాంకాచార్యులు ఆధ్వర్యంలో హోమం, మహాగణపతి పూజ, మండపారాధన, మహానైవేద్యం తదితర పూజలు నిర్వహించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఆయన సతీమణి, 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సుమారు వెయ్యి మంది భక్తులకు నిర్వహించిన అన్నదానాన్ని కొత్వాల దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కాపర్తి వెంకటాచారి, నాంపల్లి వేణుగోపాలాచారి, జుజ్జూరి ప్రభాకరాచారి, గోల్డ్ రవి, మొగిలోజు సీతారామాచారి, కాసర్ల రామారావు, చింతా నాగరాజు, దారా చిరంజీవి, కొమ్రరాజు విజయ్, సాంబయ్య, ధనలక్ష్మి, గోల్డ్ రాము, బూసి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి




**చుంచుపల్లి, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి)** పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులు, వ్యవసాయ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక మండలాల్లో తగిన వర్షపాతం లేక పంటల సాగు తగ్గిపోయిందని తెలిపారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు, వ్యవసాయ కూలీలకు పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్తగూడెం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి ప్రజలను ఆదుకోవాలని కోరారు. బోరుబావుల కింద సాగు చేసుకుంటున్న రైతులకు 16 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, రైతులకు ఇబ్బందిగా మారిన యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద 200 పని దినాలు కల్పించి రోజువారీ కూలీ రూ.600కు పెంచాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కళావతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కల్తి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే ఉమర్, జిల్లా నాయకుడు హిడమ, ఐఎఫ్‌టీయూ కొత్తగూడెం ఏరియా అధ్యక్ష కార్యదర్శులు మోత్కూరి మల్లికార్జునరావు, నాయకులు మంకెన వెంకటేశ్వర్లు, ఎన్.సంజీవ్, పీవైఎల్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నరేష్, బత్తుల నాగరాజు, పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్తి రాములమ్మ, జిల్లా నాయకురాళ్లు బి.వెంకటమ్మ, సంధ్య, రాధా, నందిని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో వైభవంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు



**కొత్తగూడెం, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):** పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వసుంధర షాపింగ్ మాల్ అధినేత ఆధ్వర్యంలో తాటిపల్లి శంకర్ నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 5వ రోజు శత్రువారణ లక్ష్మి గణపతి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా మేదరబస్తీలో విజయలక్ష్మి ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారిని లక్ష్మి గణపతి అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి మొక్కులు చెల్లించుకున్నారు.

# దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయం : సంకుబాపన అనుదీప్



**కొత్తగూడెం , సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి)** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన కీలక తీర్పును సంకుబాపన అనుదీప్ స్వాగతించారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరడంతో పాటు 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను హైకోర్టు విచారించింది. స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా సంకుబాపన అనుదీప్ మాట్లాడుతూ.. ప్రజలు ఏ పార్టీకి ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించారో, ఆ ప్రజా తీర్పుకు విలువ ఉండాలని అన్నారు. పార్టీ ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును పక్కదారి పట్టించే ప్రయత్నాలకు రాజ్యాంగ వ్యవస్థలు, న్యాయస్థానాలు తగిన సమాధానం చెబుతాయనే నమ్మకాన్ని ఈ తీర్పు బలపరిచిందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకత్వంలో న్యాయవ్యవస్థపై తమకు ఉన్న నమ్మకం మరింత బలపడిందని పేర్కొన్నారు. "ప్రజా తీర్పే ప్రజాస్వామ్యానికి పునాది.. రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి రక్షణ" అని అనుదీప్ అన్నారు.



# విజయ గణపతి నవరాత్రుల్లో సామూహిక కుంకుమ పూజలు



**పాల్వంచ, సెప్టెంబర్ 18 (తెలంగాణ వాణి):** పాల్వంచ పట్టణంలోని శ్రీ భువనేశ్వరి సహిత ఆత్మలింగేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ విజయ గణపతి స్వామివారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళా భక్తులచే సామూహిక కుంకుమ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాల్వంచ పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు భట్టు మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో వేదమంత్రోచ్చారణలు, భక్తి గీతాల మధ్య పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.